

ఊరించి.. ఉసూరుమనిపించి

- పాలమూరు డిమాండ్లకు కేంద్ర బడ్జెట్‌లో స్పష్టత కరువు
- ఓట్ ఆన్ అకౌంట్ కావడంతో వరాలజల్లుపై ప్రజల ఆశలు
- బడ్జెట్‌పై పెదవి విరుస్తున్న విపక్షాలు, హర్షం వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు
- జాతీయ హోదా, జిల్లాకో నవోదయ, సైనిక్ స్కూల్ లేనట్లే..
- ఆశలు, అంగన్‌వాడీలకు బీమా.. ఇల్లు లేని వారికి పీఎంఏవై
- నానో యూరియా మాదిరిగానే ఇకపై నానో డీఏపీ సరఫరా

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలమ్మ ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశ పరిచింది.. పార్లమెంట్ ఎన్నికల ముందు ప్రవేశపెడుతున్న బడ్జెట్ అయినందున ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలు, రైల్వేలైన్లు, విద్యాసంస్థల ఏర్పాటుకు పెద్దపీట వేస్తారని అందరూ ఆశించారు. కానీ, ఆ మేరకు బడ్జెట్ ప్రతిపాదన జరగలేదు. దీంతో దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం లభించడంలేదు. కానీ, ఈ బడ్జెట్‌పై ప్రతిపక్షాలు విమర్శిస్తుండగా బీజేపీ మాత్రం హర్షిస్తోంది.



మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ పాలమూరు ప్రజల దీర్ఘకాలిక ఆశలపై నీళ్లు చల్లిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎప్పటి నుంచో తెలంగాణలో మెజారిటీ సీట్లు సాధించాలని భావిస్తున్న బీజేపీ ప్రభుత్వం ఈసారి ఎక్కువ సీట్లలో గెలుపు కోసం కసరత్తు కూడా ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లాకు దీర్ఘకాలికంగా ఉన్న డిమాండ్లలో కొన్నింటి ప్రస్తావనైనా ఉంటుందని అందరూ భావించారు. అయితే ప్రస్తుతం ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో పాలమూరు జిల్లాకు సంబంధించి ప్రత్యేకమైన డిమాండ్లపై ఎలాంటి హామీలు, మంజూరు రాలేదు. కేవలం దేశ వ్యాప్తంగా చేపట్టాల్సిన పనులకు సంబంధించి విషయాలపైనే ప్రధానంగా బడ్జెట్ ప్రతిపాదన సాగింది. గురువారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌పై విపక్షాలు పెదవి విరుస్తుండగా బీజేపీ నాయకులు మాత్రం హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతేడాదిలాగే రూ. 7లక్షల వరకు నో ట్యాక్స్ పాలసీని కొనసాగిస్తామని ప్రకటించగా వేతన జీవులకు ఊరట లభించిందని చెప్పవచ్చు. పీఎం ఆవాస్ యోజన కింద మరో 2 కోట్ల ఇళ్లను నిర్మిస్తామని చెప్పడం కొంత కలిసొచ్చే అంశంగా చెప్పవచ్చు. గతంలో కూడా ఆవాస్ యోజన కింద రాష్ట్రానికి ఇళ్లు మంజూరు చేసినప్పటికీ వాటిని దారిమళ్లించారని కేంద్ర ప్రభుత్వం ఆరోపించింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇల్లులేని పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ. 5 లక్షలు అందిచేస్తామని ప్రకటించగా అందుకు పీఎం ఆవాస్ యోజన పథకం కలిసి వచ్చే అవకాశం ఉంటుంది. ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీలకు ఆయూష్మాన్ భారత్ పథకం కింద రూ. 5 లక్షల వరకు బీమా సౌకర్యం కల్పించనున్నారు. సోలార్ పాలసీ ద్వారా 300 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించే లక్ష్యంగా పనిచేస్తామని కేంద్రమంత్రి తెలిపారు. ఇక రైతులకు నానో యూరియా మాదిరిగానే నానో డీఏపీ సరఫరా చేస్తామన్నారు. దీనివల్ల రవాణా ఖర్చుతో పాటు, తక్కువ పరిమాణంలో ఎక్కువ పోషకాలు లభించే అవకాశం ఉండటంతో కేంద్ర ప్రభుత్వం నానో యూరియా, డీఏపీని సరఫరా చేస్తోంది.

దీర్ఘకాలిక డిమాండ్లపై ప్రస్తావన కరువు

ఉమ్మడి పాలమూరు జిల్లాలో దీర్ఘకాలికంగా పలు డిమాండ్లు ఉన్నాయి. అందులో ప్రధానమైనది పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించడం.. దీనివల్ల కేంద్రం నిధులు వెచ్చించి అత్యంత దుర్భిక్ష ప్రాంతాలపై మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లోని నియోజకవర్గాలకు తాగు, సాగు నీరు ఇచ్చే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఆ ప్రాజెక్టు పనులు జరుగుతున్నప్పటికీ నిధుల సమస్య తీవ్రంగా ఉండటం, కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్థికలోటు ఉండటంతో ఈసారి పాలమూరుకు జాతీయ హోదా ప్రకటనను ఆశించారు. కానీ, దానిపై ప్రస్తావన లేదు. అలాగే 2016లో ఉమ్మడి 10 జిల్లాలు విడిపోయి 33 జిల్లాలుగా అవతరించాయి. కొన్నేళ్ల తర్వాత కొత్త జిల్లాలకు రాష్ట్రపతి ఆమోదం కూడా లభించింది. కానీ, జిల్లాల వారీగా పలు కేంద్ర విద్యాసంస్థలు ఇంకా ఏర్పాటు కావడం లేదు. అందులో ప్రధానంగా నవోదయ పాఠశాలలు ఉన్నాయి. గతంలో ఉమ్మడి జిల్లా నవోదయ పాఠశాల నాగర్‌కర్నూలు దగ్గర ఏర్పాటు కాగా ఇప్పటికీ అదొక్కటే ఉంది. నారాయణపేటలో సైనిక్ స్కూల్ ప్రతిపాదన కూడా ఉంది. వీటిపై ఉమ్మడి పాలమూరుకు చెందిన ఎంపీలు ప్రయత్నాలు చేస్తున్నా కేంద్రం ఈసారి కూడా కనికరించలేదు. కొత్త రైల్వేలైన్లు ఏర్పాటవుతాయని ప్రకటన వచ్చినప్పటికీ అందులో గద్వాల- డోర్నకల్ రైల్వేలైన్ ఉన్నదా లేదా అనే విషయంలో స్పష్టత లేదు. ఇప్పటికే ఈ రైల్వే లైనుకు సంబంధించి ఫైనల్ లొకేషన్ సర్వే కూడా పూర్తయ్యింది. రూ. 5330 కోట్ల అంచనా వ్యయంతో ఈ లైన్ 296 కిలోమీటర్ల మేర నిర్మించేందుకు ప్రతిపాదనలు కూడా సిద్ధమయ్యాయి. అయితే ఈసారి బడ్జెట్‌లో లేకపోయినా కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత పూర్తిస్థాయి బడ్జెట్‌లో కచ్చితంగా మంజూరువుతుందనే ప్రతిపాదన ఉంది. జాతీయ రహదారులకు సంబంధించి 2.78 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశ పెట్టగా ఉమ్మడి జిల్లాలో జాతీయ రహదారులపై ఇంకా స్పష్టత రాలేదు. అయితే కీలకమైన అంశాలు కానీ, ఎన్నికల కోణంలో వరాలజల్లు మాత్రం కేంద్ర బడ్జెట్‌లో కురిపించలేదని చెప్పవచ్చు.



ఎన్నికల బడ్జెట్

ఇచ్చిన హామీలనే ఇచ్చారు. ఉపాధి హామీ పథకానికి కేటాయించిన రూ.86 వేల కోట్లు పాతబకాయిలకే సరి పోతవి, కొత్తగా కేటాయించలేదు. పదేళ్లలో దేశంలో నిరుద్యోగం పెరిగింది. బియ్యం ధరలు పెరిగాయి, కేజీ రూ.29లకు ఇస్తామనటం సరికాదు. 2024 ఎన్నికల్లో ప్రజలను మరోసారి మోసగించి ందుకే ఈ హామీలు.

- రాములు, సీపీఎం జిల్లా కార్యదర్శి

అన్ని వర్గాలకు ప్రయోజనకరం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు ఆమోద యోగ్యంగా ఉంది. విద్య, వైద్య వ్యవసాయం, రంగాలకు పెద్దపీట వేశారు. వందేభారత్ కోచ్‌లకోసం 40 వేల బోగీలను ఉపయోగించటం శుభపరిణామం. ఆయుష్మాన్ భారత్‌ను అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లకు వర్తింపజేయడం గొప్ప విషయం.

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి





ఎన్నికల స్టంట్ :

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎన్నికల స్టంట్‌లా ఉంది. దీనివల్ల ప్రజలకు ఒరిగేదేమీ ఉండదు. గతంలో బడ్జెట్‌లో చేసిన కేటాయింపులకే నిధులు విడుదల చేయలేదు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించి బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తే బాగుండేది.

- లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు

రాజ్యాంగం మార్చాలన్న వారు రాజకీయాలకు దూరం

- కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారు
- ఎంపీగా పోటీకి అడ్డంకి అయితే అధికార ప్రతినిధి పదవికి రాజీనామా
- ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ మల్లు రవి



కార్యకర్తలకు అభివాదం చేస్తున్న మల్లు రవి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, శివసేనారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు

వనపర్తి(ఆంధ్రజ్యోతి)/వనపర్తి టౌన్, ఫిబ్రవరి 1 : ఉన్నత విలువలతో రాసిన రాజ్యాంగాన్ని మార్చాలని చెప్పిన కేసీఆర్ ప్రస్తుతం రాజకీయాలకు దూరమయ్యే పరిస్థితికి వచ్చారని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ మల్లు రవి విమర్శించారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించిన ప్రజా కృతజ్ఞత సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు కేసీఆర్ ప్రభుత్వంలో ప్రజాభవన్‌కు ఎవరూ వచ్చేవారు కాదని, ప్రస్తుతం జాతర మాదిరిగా ప్రజలు వస్తున్నారని అన్నారు. కేవలం సీఎంనే కాకుండా మంత్రులను కలిసినా సమస్యలు పరిష్కారమవుతాయనే భరోసా ప్రజలకు వచ్చిందని, ఈ రెండు నెలల కాలంలోనే ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారని అన్నారు. భారత రాజ్యాంగాన్ని మార్చాలి అన్నప్పుడే కేసీఆర్ పతనం ప్రారంభమైందని, ప్రపంచ దేశాలు ఆదర్శంగా తీసుకునే రాజ్యాంగాన్ని మార్చేంత గొప్ప వ్యక్తి కేసీఆర్ కాదని ఆనాడే తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ ఓటమిని ఖరారు చేశారని గుర్తు చేశారు. రాజకీయ నాయకుడంటే ఎక్కడి నుంచో రాడని, ప్రజలకు కష్టం కలిగినప్పుడు, కడుపు మండినప్పుడు జనంలో నుంచే వస్తాడనడానికి మేఘారెడ్డే ఉదాహరణ అని అన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానం నుంచి తాను బరిలో ఉంటానని, ఒకవేళ ఎంపీగా పోటీ చేయడానికి తన పదవి అడ్డంకిగా మారితే అధికార ప్రతినిధి పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. ఈ సందర్భంగా వనపర్తి జిల్లాలోని బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, మండల అధ్యక్షులు మల్లు రవికి ఎంపీ టిక్కెట్ కేటాయించాలని తీర్మానం చేశారు.

ప్రతీ కార్యకర్తను గుండెల్లో పెట్టుకుంటా : ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించడానికి శక్తివంచన లేకుండా శ్రమించిన ప్రతీ కార్యకర్తను గుండెల్లో పెట్టుకుంటానని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. గురువారం నిర్వహించిన ప్రజా కృతజ్ఞత సభలో ఆయన మాట్లాడుతూ నాలుగు ప్రొసీడింగ్స్, నాలుగు జీవోలు తెచ్చి, నాలుగు బిల్డింగ్స్ నిర్మించిన మాజీ మంత్రి అదే అభివృద్ధి అనే భ్రమలో ఉన్నాడని ఎద్దేవా చేశారు. ప్రతీ పనిలో కమీషన్ తీసుకుని పనిచేసిన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి భాగోతం త్వరలోనే బయటపెడతామని హెచ్చరించారు. గతంలో ప్లానింగ్ బోర్డ్ చైర్మన్‌గా ఎన్నికైనప్పుడు తిరుపతికి వెళ్లడానికి దారి ఖర్చులు ఎవరిచ్చారని, రెండుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచినప్పుడు ప్రచార రథాలు, వాహనాలు సమకూర్చిన తనను మర్చిపోవడం విశ్వాసం లేని వ్యక్తులు చేసే పని అని మండిపడ్డారు. తాను టిప్పర్ నడిపి, పాలు అమ్మి, కూలీ పని చేసి ఇంతవాడినయ్యానని, మరి మీరు ఏం పనులు చేసి వేల కోట్ల ఆస్తులు సంపాదించారో చెప్పాలన్నారు. పనిపాట లేకుండా కాంగ్రెస్ పార్టీపై తప్పుడు ప్రచారం చేసే బీఆర్ఎస్ నాయకులకు గట్టిగా బదులు సమాధానం చెప్పాలని కార్యకర్తలకు సూచించారు. గతంలో తాను ప్రకటించినట్లుగానే పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తలకే భవిష్యత్‌లో పదవులు వస్తాయని అన్నారు.

మాటకు కట్టుబడి ఉంటాం : యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి

కాంగ్రెస్ పార్టీ ఒక్కసారి మాట ఇచ్చిందంటే ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి అన్నారు. ప్రజా కృతజ్ఞత సభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒక్కటేనని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎవరికి ఓటు వేసినా ఫలితం ఉండదని అన్నారు. రాముడు కేవలం బీజేపీకే కాదని, భారతదేశంలో ఉన్న ప్రతీ ఒక్కరికీ ఆరాధ్య దైవమని అన్నారు. అలాంటి రాముడిని అడ్డుపెట్టుకుని రాజకీయం చేయాలని చూస్తే బీఆర్ఎస్‌కు పట్టిన గతే బీజేపీకి పడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పథకాలు మొదటగా పార్టీ కార్యకర్త గుమ్మం ముందుకు వెళతాయని, తరువాత అర్హులైన ప్రతీ పేదవారికి చేరుతాయన్నారు. సమావేశంలో పీసీసీ డెలిగేట్ శంకర్‌ప్రసాద్, మాజీ పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు శ్రీలతరెడ్డి, రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు ధనలక్ష్మి, ఎంపీపీ కిచ్చారెడ్డి, పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, లక్కాకుల సతీష్, మునిసిపల్ కౌన్సిలర్లు, ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కుష్ఠుపై సమరం

- వ్యాధిపై ప్రజలకు ఈ నెల 12 వరకు అవగాహన
- వనపర్తి జిల్లా వ్యాప్తంగా 28 మంది రోగుల గుర్తింపు



వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

వనపర్తి వైద్యవిభాగం, ఫిబ్రవరి 1: మహమ్మారి కుష్ఠువ్యాధిని తరిమి కొట్టడానికి వనపర్తి జిల్లా యంత్రాంగం మరోసారి నడుం బిగించింది. ఈ వ్యాధి మరీ అంత ప్రమాదకరమైనది కాకున్నా.. వ్యాధి తీవ్రత అంతగా లేకున్నా.. తేలికగా తీసుకోవద్దని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వ్యాధి లక్షణాలను ముందుగానే గుర్తించి, తగిన వైద్యం తీసుకుంటే పూర్తిగా అరికట్టవచ్చని చెబుతున్నారు. అందుకోసం జిల్లా వ్యాప్తంగా జనవరి 30 నుంచి ఫిబ్రవరి 12 వరకు గ్రామీణ స్థాయి నుంచి ప్రజలకు వ్యాధిపై అవగాహన కల్పించేందుకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించారు. గ్రామ స్థాయిలో పర్యటించి, అవగాహన కల్పిస్తూ, ప్రతిజ్ఞ చేస్తున్నారు.

రెండు రకాలుగా వ్యాధి లక్షణాలు..

కుష్ఠువ్యాధి అనేది మైకోబాక్టీరియం లెప్రే అనే బ్యాక్టీరియా వల్ల కలిగే దీర్ఘకాలిక అంటువ్యాధి. నెమ్మదిగా వ్యాపించే ఈ వ్యాధి కొన్నేళ్ల తరువాత దాని లక్షణాలను బయటపెడుతుంది. వ్యాధి తీవ్రతలను రెండు రకాలుగా విభజించారు. ఒకటి పాసిబాసిల్లరీ లెప్రసీ అనే రకం. ఇది సోకితే వ్యక్తి శరీరంపై ఒకటి నుంచి ఐదు వరకు స్పర్శ లేని, రాగి వర్ణంలో మచ్చలు వస్తాయి. ఇది చాలా తక్కువ మోతాదు అంటువ్యాధిగా చెబుతారు. రెండోది మల్టీబాసిల్లరీ లెప్రసీ రకం. ఇది సోకితే ఒక వ్యక్తి చర్మంపై ఐదు కంటే ఎక్కువగా మచ్చలు, గాయాలు ఉంటాయి. ఇలాంటి వ్యక్తుల వల్ల వ్యాధి ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాపించే ప్రమాదం ఉంటుంది. గతంలో జిల్లాలో నిర్వహించిన ఇంటింటి లెప్రసీ సర్వే ద్వారా రెండు అంతకంటే తక్కువ మచ్చలు ఉన్న కేసులు 20, ఒకే మచ్చ కలిగిన కేసులు ఏడు బయటపడ్డాయి. తాజాగా మరో కేసుతో కలిసి మొత్తం 28 మంది శరీరంపై లేత రాగి వర్ణం కలిగిన స్పర్శలేని మచ్చలను గుర్తించారు. వారికి వైద్యం అందిస్తున్నారు. అరికాళ్లకు(పాదాలు) పుండ్లు అయిన నలుగురికి ఇటీవలే ఎంసీఆర్(మైక్రో సెల్యులార్ రబ్బర్) చెప్పులను నాలుగు జతలు వైద్యాధికారులు అందించారు. అంతేకాకుండా హైదరాబాద్‌లోని ఒక ట్రస్టు ఆస్పత్రిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఇద్దరికి పూర్తి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించారు.



వివక్ష చూపించొద్దు

కుష్ఠు వ్యాధికి బారిన పడిన వారిపై వివక్ష చూపొద్దు. ఈ వ్యాధిపై జిల్లా వ్యాప్తంగా జనవరి 30 నుంచి ఫిబ్రవరి 12 వరకు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతిజ్ఞ కార్యక్రమానికి కలెక్టర్ చేత ఇటీవలే శ్రీకారం చుట్టాం. వ్యాధిపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ముందుగా గుర్తించి, చికిత్స పొందితే పూర్తిగా నిర్మూలించవచ్చు.

- డాక్టర్ సాయినాథ్‌రెడ్డి, లెప్రసీ నివారణ జిల్లా ప్రోగ్రాం అధికారి, వనపర్తి

ఆలస్యంగా గుర్తించడం వల్ల..

శరీరంపై స్పర్శలేని మచ్చలు, లేత రాగి వర్ణంలో ఉండే మచ్చలు, అరికాళ్లపై పుండ్లు ఏర్పడటం, కనుబొమ్మలు, కనురెప్పలు సన్నబడటం, లేదా వాటిని కోల్పోవడం, ముక్కు ఆకారం మారడం, స్పర్శలేని మచ్చల దగ్గర చమటలు రాకపోవడం, వెంట్రుకలు పెరగకపోవడం వంటి లక్షణాలు కుష్ఠు వ్యాధిని సూచిస్తాయి. ఈ లక్షణాలను ఆలస్యంగా గుర్తించడం వల్ల వ్యాధి తీవ్రత పెరిగే ప్రమాదం ఉంటుంది. ఈ లక్షణాలను తగిన సమయంలో గుర్తించకపోతే కండరాలు బలహీన పడటం, పక్షవాతం రావడంతో పాటు శాశ్వత అంగవైకల్యం ఏర్పడటానికి దారి తీస్తుంది.

మార్కెట్ యార్డులో వ్యక్తి దారుణ హత్య

దేవరకద్ర, ఫిబ్రవరి 1 : మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డులో ఓ వ్యక్తి దారుణహత్యకు గురైన సంఘటన గురువారం ఉదయం చోటుచేసుకున్నది. ఈ ఘటనకు సంబంధించి సీఐ రామకృష్ణ, ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. కోయిల్‌కొండ గ్రామానికి చెందిన మహేష్ (35) అనే వ్యక్తి చిత్తు కాగితాలు ఏరుకుంటూ జీవనోపాధి పొందేవాడు. బుధవారం అర్ధరాత్రి దేవరకద్ర మార్కెట్ యార్డులో రాడ్డుతో అతని తలపై గుర్తు తెలియని వ్యక్తులు బలంగా కొట్టడంతో మృతి చెంది కనిపించాడు. గురువారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వివాహేతర సంబంధం, పాతకక్షలే ఈ హత్యకు కారణమని తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతుడి తల్లి రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయిపై నిఘా

- మత్తుకు బానిసలవుతున్న యువత
- పట్టుబడితే ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసులు
- తాగేవారితో పాటు పరఫరా చేసేవారిపై దృష్టి



బలిగెరలో మిరపతోటలో పెంచిన గంజాయిని పట్టుకున్న అధికారులు(ఫైల్)

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 1: గంజాయి మత్తులో యువత చిత్తవుతోంది. గంజాయి వినియోగం.. సరఫరాపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తున్నా అక్రమార్కులు ఏదో దారిన గంజాయి సరఫరా చేస్తూ యువతను మత్తులోకి దించుతున్నారు. ఈ క్రమంలోనే ఎంతో మంది మత్తుకు బానిసలై తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలో అర్ధరాత్రి గంజాయి తీసుకుంటున్న నలుగురు యువకుల ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన నలుగురు డిగ్రీ, పీజీ పూర్తిచేసిన వారే కావడం విశేషం. గతేడాది ఎక్సైజ్ పోలీసులు గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తిని పాలమూరు బస్టాండ్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతను సరఫరా చేసే జాబితాలో పదుల సంఖ్యలో డాక్టర్లు ఉండటంతో అధికారులు ఖంగుతిన్నారు. ఇలా విద్యార్థులు, యువత, వైద్యులు మత్తుకు అలవాటు పడుతూ తమ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసుకుంటు న్నారు.



గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన ఎక్సైజ్ పోలీసులు(ఫైల్)

ఇతర ప్రాంతాల నుంచి పరఫరా..

మహబూబ్‌నగర్, జడ్చర్ల వంటి ప్రాంతాలలో కొందరు గంజాయిని సిగరేట్‌లో పెట్టుకుని తాగడం కోసం తెచ్చుకుంటుండగా మరి కొందరు తాగడంతో పాటు ఇతరులకు విక్రయిస్తున్నారు. హైదరాబాద్‌లోని దూల్‌పేట, వైజాగ్, రాయిచూర్ నుంచి గంజాయిని తీసుకువచ్చి మహబూబ్‌నగర్, జడ్చర్ల పట్టణాలలో విక్రయిస్తున్నారు. ఐదు గ్రాములు, 10 గ్రాముల ప్యాకెట్‌లను అక్కడ రూ.100-200కు కొనుగోలు చేసి ఇక్కడ రూ.400-800 వరకు విక్రయిస్తున్నారు. గతంలో పెద్ద మొత్తంలో గంజాయి పట్టుబడేది ఇప్పుడు కఠినతరం చేయడంతో చిన్నచిన్న ప్యాకెట్‌లలో గ్రాముల చొప్పున విక్రయిస్తున్నారు. గంజాయి తాగినా.. సరఫరా చేస్తూ పట్టుబడినా నాన్‌బెయిలబుల్ కేసు నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్) సెక్షన్ 20 కింద కేసు నమోదు చేస్తున్నారు. దీని ప్రకారం నెలనుంచి మూడు నెలల వరకు బెయిల్ దొరకే పరిస్థితి ఉండదు.

మత్తులో యువత

- రైతుల నుంచి భూమి కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నవైనం
- జిల్లాలో ఇప్పటి వరకు తొమ్మిది మంది అరెస్ట్

గద్వాల క్రైం : జోగుళాంబ గద్వాల జిల్లాలో ఒకవైపు గుట్టుగా గంజాయి మొక్కలను పెంచుతున్నారు. మరోవైపు ఇతర ప్రాంతాల నుంచి యువత గంజాయి చాక్లెట్, హుక్కా, డ్రగ్స్‌ను తెస్తూ ఇక్కడి యువతను మత్తులోకి దింపుతున్నారు. ఉన్నత చదువులకు హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు వెళ్లిన యువత అక్కడ గంజాయికి అలవాటు పడటమే కాకుండా వారు ఇక్కడికి వచ్చేటప్పుడు గంజాయి చాక్లెట్లతో పాటు డ్రగ్స్, హుక్కా ఇతర మత్తు పదార్థాలు తెచ్చి ఇక్కడి యవతను వాటి ప్రలోభాలకు గురిచేస్తున్నట్లు తెలుస్తుంది. రాష్ట్రంలోనే గంజాయి సాగు గద్వాల, వనపర్తి, మహబూబ్‌నగర్, భద్రాచలం, ఒడిశా, వైజాక్ తదితర ప్రాంతాలలో ఎక్కువగా సాగు చేస్తున్నారు. గద్వాల, వనపర్తి జిల్లాలో ఎక్కువగా ఉన్నదని గతంలో రాష్ట్ర ఉన్న తాధికారులు సైతం వెల్లడించారు. తాజాగా నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గంజాయి, హుక్కా, డ్రగ్స్ నివారించాలని సంకల్పంతో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రత్యేక డ్రైవ్ ద్వారా వీటిని నిర్మూలించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో 2021 నుంచి ఇప్పటివరకు ఐదు గంజాయి కేసులు నమోదు కాగా 9 మందిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఇందులో గద్వాల ఎక్సైజ్ పరిధిలో 2021లో రెండు కేసులు, 2023లో ఒక కేసు నమోదు చేశారు. అలాగే అలంపూర్ నియోజక వర్గంలో 2023 నవంబరులో రెండు కేసులు నమోదు చేశారు.

గంజాయి, డ్రగ్స్ రహిత జిల్లాగా గద్వాల



జోగుళాంబ గద్వాల జిల్లాను గంజాయి, హుక్కా, డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తాం. గంజాయి సాగు చేసేవారిపై కేసు నమోదు చేయడంతో పాటు గతంలో సాగుచేసిన వారికి రైతుబంధు నిలిపేశాం. ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న యువతపై నిఘా ఉంచాము. గంజాయి వినియోగిస్తే జరిగే నష్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. గంజాయి, డ్రగ్స్ ఉంటే తమకు సమాచారం అందించాలి.

- సైదులు, ఎక్సైజ్ సూపరింటెండెంట్, గద్వాల జిల్లా

కన్నతల్లిని గొంతుకోసి చంపిన కొడుకు

పెద్దమందడి, ఫిబ్రవరి 1: నవమాసాలు మోసి పెంచిన కన్న తల్లిని కొడుకు కిరాతకంగా కత్తిపీటతో గొంతుకోసి హత్య చేసిన సంఘటన గురువారం వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలో చోటుచేసుకున్నది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అమ్మపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బండకాడి తండాకు చెందిన వర్త్యవత్ చిన్నమ్మ(50)కు ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో పెద్ద కుమారుడు రాజునాయక్ హైదరాబాద్‌లో ఇటీవల ఇంటిని కొనుగోలు చేశారు. ఇల్లు వాస్తు సరిగాలేదని ఇంటిని అమ్మాలని రాజు భార్య, తల్లి ఒత్తిడి చేశారు. తన భార్యకు తల్లి వత్తాసు పలుకుతోందని మనసులో పెట్టుకున్నాడు. గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తల్లిని కిరాతకంగా గొంతుకోసి హత్య చేశాడని సీఐ రత్నం, ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. మృతురాలు చిన్న కుమారుడు సూర్యనాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎనిమిది మంది ఎస్ఐల బదిలీ

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 1 : జోగుళాంబ గద్వాల జోన్ పరిధిలో ఎనిమిది మంది ఎస్ఐలు బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ ఉత్తర్వులు జారీ చేశారు. అభిషేక్‌రెడ్డి వనపర్తి వీఆర్ నుంచి నవాబ్‌పేటకు, పి.అశోక్‌బాబు మహబూబ్‌నగర్ వీఆర్ నుంచి జడ్చర్ల టౌన్ సెకెండ్ ఎస్ఐగా, కె.తిరుపాజీ సీసీఎస్ మహబూబ్‌నగర్ నుంచి బాలానగర్, కె.శ్రీనివాస్ బాలానగర్ నుంచి సీసీఎస్ మహబూబ్‌నగర్, పి.వీరబాబు వీఆర్ నాగర్‌కర్నూల్ నుంచి ఉట్కూర్, డి.లెనిన్ ఊట్కూర్ నుంచి నాగర్‌కర్నూల్ వీఆర్, కె.రవి వీఆర్ మహబూబ్‌నగర్ నుంచి రాజాపూర్, జి.వెంకట్‌రెడ్డి రాజాపూర్ నుంచి మహబూబ్‌నగర్ వీఆర్‌కు బదిలీ అయ్యారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నవాబ్‌పేట, ఫిబ్రవరి 1 : ఇంట్లో ఎవరూ లేని సమయంలో మతిస్థిమితం లేని ఓ మహిళ సిలిండర్‌పై వంట చేస్తుండగా చీర కొంగుకు నిప్పంటుకొని మంటలు చెలరేగి తీవ్రగాయాల పాలైన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం జంగమయ్యపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఇన్‌చార్జీ ఎస్ఐ సురేష్ బాబు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మండెం సూరమ్మ కొంత కాలంగా మతిస్థిమితం లేకుండా ఇంటివద్ద ఉంటున్నది. గత నెల 19న ఇంట్లో ఎవరూ లేని సమయంలో సిలిండర్‌పై వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు ఆమె చీర కొంగుకు నిప్పు అంటుకోవడంతో మంటలు చెలరేగి నడుము భాగంలో కాలింది. ఇది గమనించిన ఆమె భర్త లింగయ్య వెంటనే మంటలు ఆర్పి చికిత్స నిమిత్తం 108లో జిల్లా ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో మృతి చెందినట్లు ఆయన తెలిపారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్ రుణం తీర్చుకోవాలి

- కాంగ్రెస్ ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తోంది
- సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి



అవుసులోన్‌పల్లి సమీపంలో దివ్యాంగుడితో మాట్లాడుతున్న సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఊట్కూర్, ఫిబ్రవరి 1 : తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ రుణం తీర్చుకోవాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఎంపీలుగా గెలిపించి, రాహుల్ గాంధీని పీఎం చేయాలని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన పాలమూరు న్యాయ పాదయాత్ర రెండో రోజు గురువారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని పెద్దజట్రం, అవుసులోన్‌పల్లి, బిజ్వార్, పులిమామిడి గ్రామాల్లో కొనసాగింది. ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించినట్లుగానే ఎంపీలను కూడా గెలిపించాల న్నారు. కాంగ్రెస్ పార్టీ అంటే కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీల మాదిరిగా మాట తప్పే పార్టీ కాదు అన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తోందన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.10 లక్షల ఆరోగ్య శ్రీ అమలు చేసిందన్నారు. ఫిబ్రవరి 10లోపు మిగిత హామీలు కూడా అమలు చేస్తుందన్నారు. దేశంలో పది సంవత్సరాలు పాలించిన మోదీ ప్రభుత్వం వల్ల ఎలాంటి అభివృద్ధి జరగలేదని, దేశంలో మార్పు రావల్సిన అవసరం ఉందన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల్లో నన్ను గెలిపించినట్లు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యరిథికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. పెద్దజట్రంలోని అంద్రికే భీమన్న తాత గుడిలో పూజలు చేసి అనంతరం ప్రారంభమైన పాదయాత్ర అవుసులోన్‌పల్లికి చేరుకుంది. అక్కడి నుంచి బిజ్వార్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీజెండాను ఆవిష్కరించారు. జలసాధన సమితి నాయకులు హెచ్ నరసింహ ఎమ్మెల్యేతో వంశీచంద్‌రెడ్డిని సన్మానించారు. సాయంత్రం పులిమామిడి గ్రామంలోని రామలింగేశ్వర ఆలయంలో పూజల అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అంతకుముందు బస్టాండ్ సెంటర్‌లోని కార్నర్ మిటింగ్‌తో పాదయాత్ర ముగిసింది. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ వనజ, ఎన్ఆర్ఐ సెల్ నాయకులు పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు శివసేనారెడ్డి, నాగరాజుగౌడ్, డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, నాయకులు బాలకృష్ణారెడ్డి, గోపాల్ రెడ్డి, లక్ష్మారెడ్డి, రవికుమార్‌యాదవ్, మాజీ ఎంపీపీ మణెమ్మ, మాజీ వైస్ ఎంపీపీ విజయసింహారెడ్డి, పులిమామిడి సర్పంచ్ సూరయ్యగౌడ్, నాయకులు బస్వరాజ్‌గౌడ్, జనార్దన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, మండలాధ్యక్షుడు విఘ్నేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తాం

మక్తల్ : ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తామని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి కర్నీ గ్రామంలో నిర్వహించిన న్యాయయాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముదిరాజ్‌లకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి అసంపూర్తి కాల్వలు పూర్తి చేస్తామన్నారు. వందశాతం ఆయకట్టు రైతులకు సాగు నీరందించేదందుకు కృషి చేస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్న కాంగ్రెస్‌ను ఆదరించి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో అధికారంలోకి తీసుకువచ్చి రాహుల్ గాంధీని ప్రధాని చేసేందుకు కార్యక ర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, బీకేఆర్ ఫౌండేషన్ అధినేత బాల్రకిష్టారెడ్డి, గోపాల్ రెడ్డి, రవికుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

భారత్‌కు 31 సాయుధ డ్రోన్లు

వాషింగ్టన్, ఫిబ్రవరి1: వాస్తవాధీన రేఖ వెంబడి చైనాకు చెక్ పెట్టేందుకు.. హిందూ మహాసముద్రంలో పట్టు పెంచుకునేందుకు ఇండియాకు ఎంతగానో ఉపయోగపడే ఎమ్‌క్యూ-9బి ప్రిడేటర్ డ్రోన్లను విక్రయించడానికి అమెరికా ప్రభుత్వం గురువారం ఆమోదం తెలిపింది. ఈ డీల్ కింద 3.99 బిలియన్ డాలర్ల (సుమారు రూ.33వేల కోట్లు) విలువైన 31 డ్రోన్లను అమెరికా సరఫరా చేయనుంది. ఎమ్‌క్యూ-9బి రిమోట్లీ పైలెటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్‌గా పిలిచే ఈ సాయుధ డ్రోన్ల కొనుగోలుపై గత జూన్‌లో ప్రధాని మోదీ అమెరికాలో పర్యటన సందర్భంగా ఇరు దేశాల మధ్య అంగీకారం కుదిరింది. ఇందుకు అవసరమైన అనుమతి మంజూరు చేస్తూ అమెరికా కాంగ్రెస్ సర్టిఫికెట్ ఇచ్చిందని డిఫెన్స్ సెక్యూరిటీ కో-ఆపరేషన్ ఏజెన్సీ తాజాగా తెలిపింది. అమెరికా-భారత్ మధ్య వ్యూహాత్మక సంబంధాల బలోపేతంలో భాగంగా ఈ మెగా డ్రోన్‌డీల్ జరిగిందని పేర్కొంది. భారత్ భద్రతను పెంచేందుకు, ఇండో-పసిఫిక్, దక్షిణాసియా ప్రాంతంలో సుస్థిర, శాంతి, ఆర్థిక ప్రగతిని పెంపొందించేందుకు ఇది ఉపకరిస్తుందని తెలిపింది. మానవరహిత నిఘా విషయంలో భారత్ సామర్థ్యాలు మరింత బలోపేతమవుతాయని అభిప్రాయపడింది. సైన్యం ఆధునికీకరణకు భారత్ కట్టుబడి ఉందని, అందువల్ల వీటిని అందజేయడంలో తమకు ఇబ్బందేమీ లేదని పేర్కొంది. వీటిని హై ఆల్టిట్యూడ్ లాంగ్ ఎండ్యూరెన్స్ (హెచ్ఏఎల్ఈ-హేల్)యూఏవీలుగా వ్యవహరిస్తారు. ఈ 31లో 15 డ్రోన్లను సీగార్డియన్ల పేరుతో నేవీకి ఇస్తారు. స్కై గార్డియన్ పేరుతో ఎయిర్‌ఫోర్స్‌కు 8డ్రోన్లు, ల్యాండ్ వర్షన్ పేరుతో ఆర్మీకి మిగతా 8కేటాయిస్తారు. ఖలిస్థాన్ ఉగ్రవాది గురుప్రీత్ సింగ్ పన్నూన్ హత్యకు భారత్ కుట్రపన్నుతున్నందున డ్రోన్లఅమ్మకాల ఒప్పందాన్ని అమెరికా నిలిపివేస్తుందంటూ వార్తలువచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ ఆమోదం లభించింది.

వీసా ఫీజులు భారీగా పెంచిన అమెరికా

వాషింగ్టన్, ఫిబ్రవరి1: అమెరికాకు వచ్చే విదేశీయుల నుంచి వసూలు చేసే నాన్-ఇమిగ్రెంట్ వీసా ఫీజులను బైడెన్ ప్రభుత్వం బుధవారం భారీగా పెంచింది. వీసా ఫీజులను పెంచడం 2016 తర్వాత ఇదే ప్రథమం. ఏప్రిల్1 నుంచి ఇవి అమల్లోకి వస్తాయి. భారతీయులకు అత్యంత ఉపయోగకరంగాఉండే హెచ్-1బీ, ఎల్-1, ఈబీ-5 వీసాల రుసుములు గణనీయంగా పెరిగాయి. విదేశాల వృత్తి నిపుణులు అమెరికాలో ఉద్యోగాలు చేయడానికి హెచ్-1బీ వీసాలు ఇస్తారు. ఇందుకు ఉద్దేశించిన ఫారం 1-129 ఫీజు 460డాలర్ల (రూ.38,150)నుంచి 780డాలర్ల (రూ.64,690)కు పెరిగింది. హెచ్-1బీ వీసాల రిజిస్ట్రేషన్ రుసుము 10 డాలర్ల నుంచి 215 డాలర్ల (రూ.17,830)కు పెంచారు. ఈ నిర్ణయం వచ్చే ఏడాది నుంచి అమల్లోకి వస్తుంది. బహుళజాతి కంపెనీ ఉద్యోగుల బదిలీకి ఉద్దేశించిన ఎల్-1 వీసాల రుసుములు 460డాలర్ల నుంచి 1,385 డాలర్ల (రూ.1,14,860)కు పెరిగాయి. అమెరికా పౌరులకు ఉద్యోగాలిచ్చే వారికి ఈబీ-5 వీసాలు మంజూరు చేస్తారు. వీటి రుసుములు 3,675డాలర్ల నుంచి 11,160 డాలర్ల (రూ.9,25,510)కు పెరిగాయి. మరికొన్ని రకాల వీసాల ఫీజులు స్వల్పంగా తగ్గాయి.

కాంగ్రెస్ వలలో పడొద్దు

(మొదటి పేజీ తరువాయి)

చేయకండి. సీఎంను కలవాలనుకుంటే సమాచారం ఇచ్చి వెళ్లండి' అని సున్నితంగా హెచ్చరించినట్లు సమాచారం. "కాంగ్రెస్ ప్రభుత్వం చాలా సవాళ్లను ఎదుర్కొనాల్సి ఉంది. రాష్ట్ర ఆదాయం అంతంత మాత్రంగా ఉంది. కనీసం అంచనా వేయకుండానే ఇబ్బడిముబ్బడి హామీలిచ్చారు. అమలు చేయలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం ఉంటుందా? ఉండదా? అనేది వారి చేతుల్లోనే ఉంది. ప్రతిపక్షంగా సమర్థంగా వ్యవహరిద్దాం. ఏడాది లోపే ప్రజలకు అసలు విషయం తెలుస్తుంది. మనం తొందరపడాల్సిన పనిలేదు. సంయమనం పాటిద్దాం. చక్కగా నిలబడితే చాలు.. వచ్చే ప్రభుత్వం మనదే"నని కేసీఆర్ పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలించామని.. ఓడిపోయినంత మాత్రాన నిరుత్సాహం, భయడాల్సిన అవసరం లేదన్నారు. కృష్ణా ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగించే అంశంపై పార్లమెంటులో నిరసన తెలపాలని ఎంపీలకు సూచించారు. కేంద్ర జల శక్తి శాఖ మంత్రినీ కలవాలని నిర్దేశించారు. లోక్‌సభ ఎన్నికల్లో గట్టిగా పోరాడదామని.. అందరితో చర్చించి, మంచి అభ్యర్థులను ప్రకటిస్తామని తెలిపారు.

అసాధ్యమని ఆర్బీఐనే చెప్పింది

రూ.36 వేల కోట్ల రైతు రుణమాఫీ అసాధ్యమని, ఏక మొత్తంలో ఇన్ని కోట్లు మాఫీ వీలుకాదని ఆర్బీఐ తెలిపిందని పార్టీ నేతల వద్ద కేసీఆర్ వ్యాఖ్యానించారు. అయినా.. ఏపీలో చెల్లించారు. తెలంగాణలోనూ రుణమాఫీ చేస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి రైతాంగాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. "మనం అధికారంలో ఉన్నప్పుడే కేంద్ర ప్రభుత్వం ఏమీ చేయలేదు. కాంగ్రెస్ ఉంటే చేస్తుందా? వాళ్లకూ చేయదు. శుక్రవారం తెలంగాణ భవన్‌కు వస్తా. బడ్జెట్ సమావేశాల్లో పాల్గొంటా" అని కేసీఆర్ తెలిపారు. కాగా, బడ్జెట్ సమావేశాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అనుసరించాల్సిన తీరుపై అంశాల వారీగా చర్చించారు. కేటీఆర్, పోచారం, హరీశ్‌రావు, తలసాని, ప్రశాంత్‌రెడ్డి, మల్లారెడ్డి, జగదీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా ప్రమాణం

గజ్వేల్ ఎమ్మెల్యేగా కేసీఆర్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. శాసనసభ స్పీకర్ గడ్డ ప్రసాద్ తన



చాంబర్‌లో మధ్యాహ్నం 12.45 గంటలకు ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పోచారం, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు పాల్గొన్నారు. అనంతరం అసెంబ్లీ ఆవరణలోని ప్రతిపక్ష నేత చాంబర్‌లో కేసీఆర్ ప్రత్యేక పూజలు చేసి బీఆర్ఎస్ శాసనసభాపక్ష నేతగా బాధ్యతలు చేపట్టారు. కాగా, ఈ కార్యక్రమాలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, చింతా ప్రభాకర్, కాలె యాదయ్య, పద్మారావుగౌడ్ హాజరు కాలేదని సమాచారం.

రేవంత్ నేను పాత మిత్రులం!

త్వరలోనే రేవంత్‌ను కలుస్తా: మల్లారెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): "నేను రేవంత్‌రెడ్డి పాత మిత్రులం. టీడీపీలో కలిసి పనిచేశాం. ఇప్పుడు ఆయన రాష్ట్ర సీఎం. ఆయనను కలిస్తే తప్పేంటి" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. రేవంత్‌ను త్వరలోనే కలుస్తానని చెప్పారు. కీసర ఆలయంలో నిర్వహించబోయే పూజా కార్యక్రమాలకు ఆహ్వానిస్తానని తెలిపారు. గురువారం అసెంబ్లీ ప్రాంగణంలో మల్లారెడ్డి మీడియాతో మాట్లాడారు. మల్కాజిగిరి ఎంపీ స్థానంలో పోటీ చేయాలని బీఆర్ఎస్ అధిష్ఠానం తనను కోరుతోందని చెప్పారు. అయితే, తన కుమారునికి అవకాశం కల్పించాలని అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశానన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేయబోనని చెప్పారు. అయితే, "రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఆ పార్టీ వాళ్లకు షాక్.. అధికారం కోల్పోవడం మాకు షాక్" అని మల్లారెడ్డి వ్యాఖ్యానించారు. కాగా, హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం నెమ్మదించిందన్న మల్లారెడ్డి.. త్వరలో గోవాలో రియల్ వ్యాపారం చేస్తానని చెప్పారు. ఇప్పటికే గోవాలో ఓ హోటల్ కొన్నట్లు తెలిపారు.

పాత.. కొత్త స్పీకర్ల కలయిక!



బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 1: ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డాక రాష్ట్రంలో అసెంబ్లీ స్పీకర్లుగా పనిచేసిన, చేస్తున్న ముగ్గురు ఒకచోట కలిశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తరఫున అసెంబ్లీ స్పీకర్‌గా 2014-19 వరకు మధుసూదనా చారి, 2019-23 వరకు పోచారం శ్రీనివాస్‌రెడ్డి కొనసాగారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం తరఫున 2023 డిసెంబరు నుంచి గడ్డం ప్రసాద్.. స్పీకర్‌గా కొనసాగుతున్నారు. గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం సందర్భంగా వారు ముగ్గురు కలిశారు. ఈ సందర్భంగా ముగ్గురూ కలిసి ఫొటో దిగారు.

టచ్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. హైకమాండ్ వద్దనడంతో ఆగాం

» ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ

కామారెడ్డి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): "బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చాలా మంది కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పలువురు ఎమ్మెల్యేలు కలవడమే ఇందుకు నిదర్శనం. వారంతా కాంగ్రెస్‌లో చేరే అవకాశాలున్నాయి. అయితే.. హైకమాండ్ ఇప్పుడప్పుడే పార్టీ ఫిరాయింపులు వద్దని చెప్పింది. అందుకే.. ఫిరాయింపులను ప్రోత్సహించడంలేదు" అని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ వ్యాఖ్యానించారు. గురువారం ఆయన కామారెడ్డిలో జరిగిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని ప్రసంగించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెలవదన్నారు. కేటీఆర్ అహంకారపూరితంగా మాట్లాడుతున్నారంటూ షబ్బీర్ అలీ మండిపడ్డారు. "రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్‌ను ఛీ కొట్టినప్పటికీ కేటీఆర్ అహంకారం తగ్గడంలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కాకముందే సర్కారును కూల్చేస్తామని, త్వరలోనే ప్రభుత్వం పడిపోతుందంటూ కేటీఆర్ అహంకారపూరిత మాటలు మాట్లాడుతున్నారు. ప్రభుత్వాన్ని ఎలా కూలుస్తారో చూస్తాం" అని సవాల్ విసిరారు. పదేళ్లుగా రాష్ట్రాన్ని బీఆర్ఎస్ లూటీ చేసిందని ఆరోపించారు. ఓ అధికారి వద్దే రూ.100 కోట్ల అవినీతి సొమ్ము బయటపడడం బీఆర్ఎస్ పాలనకు నిదర్శనమని ఆయన విమర్శించారు.

ఎంపీ టికెట్ ఆశావహులతో గాంధీభవన్‌లో సందడి

కాంగ్రెస్ టికెట్ కోసం 41 మంది దరఖాస్తులు

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు దరఖాస్తులు సమర్పించడానికి వచ్చిన ఆశావహులు, వారి అనుచరులతో గాంధీభవన్‌లో గురువారం సందడి నెలకొంది. పార్టీ తరఫున తమకు టికెట్ కేటాయించాలని కోరుతూ 41 మంది అభ్యర్థులు దరఖాస్తులు ఇచ్చారు. బుధవారం ఏడుగురు దరఖాస్తు చేసుకోగా గురువారం 34 మంది పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తూ దరఖాస్తులను సమర్పించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సతీమణి ఖమ్మం పార్లమెంట్ స్థానానికి దరఖాస్తు చేశారు. అదే నియోజకవర్గం నుంచి తనకు అవకాశం కల్పించాలని పార్టీ సీనియర్ నేత వి.హన్మంతరావు దరఖాస్తు సమర్పించారు. భువనగిరి నుంచి చామల కిరణ్ కుమార్ రెడ్డి, నిజామాబాద్ నుంచి ఆకుల లలిత తదితరులు లోక్‌సభ బరిలో నిలిచేందుకు తమకు అవకాశం కల్పించాలని దరఖాస్తులు అందజేశారు. నియోజకవర్గాల వారిగా.. మహబూబాబాద్ 9, నాగర్‌కర్నూల్ 8, వరంగల్ 6, భువనగిరి 6, ఖమ్మం 2, నిజామాబాద్ 3 చొప్పున దరఖాస్తులు అందినట్లు గాంధీభవన్ వర్గాలు పేర్కొన్నాయి.

బడ్జెట్‌లో అందమైన అబద్ధాలు చెప్పారు

» సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

హైదరాబాద్, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మధ్యంతర బడ్జెట్‌లో అందమైన భాషతో అందమైన అబద్ధాలు చెప్పారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ విమర్శించారు. బడ్జెట్‌లో ఉద్యోగాల ఊసే లేదని, కార్పొరేట్ రంగానికి పెద్దపీట వేశారన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి చూపారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ ఊసే లేదని, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు నిధులు ప్రకటించలేదన్నారు. విద్యా రంగానికి 10శాతం నిధులు కేటాయించాల్సి ఉన్నా విస్మరించారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ అన్నారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేసేలా బడ్జెట్ ఉందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ విమర్శించారు.

ఇది భ్రమల బడ్జెట్: తమ్మినేని

కేంద్ర బడ్జెట్‌ను కార్పొరేట్లకు లాభాలు కట్టబెట్టే, ప్రజలను భ్రమల్లో పెట్టే బడ్జెట్ అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రకటించిన బడ్జెట్ ఇది అని పేర్కొన్నారు.

జనాభా వృద్ధి రేటు సవాళ్లపై కమిటీ

» ఉన్నతాధికారులతో ఏర్పాటు చేయనున్న కేంద్రం
» సంతానోత్పత్తి రేటు తగ్గుతోందంటూ నివేదికలు
» తగినంతగా రీ ప్లేస్‌మెంట్ లేదనే ఆందోళనలు..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: దేశంలో జనాభా వృద్ధి రేటులో ఎదురవుతున్న సవాళ్లపై ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మల తెలిపారు. సంతానోత్పత్తి రేటు భర్తీ స్థాయుల (రీప్లేస్‌మెంట్ రేట్) కంటే పడిపోయినట్లు గణాంకాలు సూచిస్తుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దేశంలో 2011లో చివరిసారిగా జనాభా లెక్కల సేకరణ చేపట్టారు. 2021లో మళ్లీ గణన నిర్వహించాల్సి ఉన్నప్పటికీ కొవిడ్ నేపథ్యంలో వాయిదా వేశారు. ఈ క్రమంలో జనాభాపై సాధికార లెక్కలు లేవు. వృద్ధి రేటు 2.1 నుంచి 2కి తగ్గిందంటూ 2020 నాటి శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (ఎస్ఆర్ఎస్), 2.2 నుంచి 2కు పడిపోయిందంటూ నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్) పేర్కొన్నాయి. దీనికి పరిష్కార మార్గాలను కమిటీ సూచించనుంది. జనాభా వేగవంతమైన వృద్ధి, మార్పుల నుంచి ఉత్పన్నమయ్యే సవాళ్లను పరిశీలించనుంది.

గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు యాభై ఏళ్లు

» భాగ్యనగరం నుంచి వాల్తేరుకు మొదటి రైలు ఇదే
» 1974 ఫిబ్రవరి 1న ప్రారంభమైన ఎక్స్‌ప్రెస్

సికింద్రాబాద్/హైదరాబాద్ సిటీ, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గోదావరి ఎక్స్‌ప్రెస్.. ఏపీలోని ఉభయ గోదావరి జిల్లాలతోపాటు ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన రైలు ప్రయాణికులకు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రైలు. గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో బెర్తు దొరికిందంటే.. బంగారం బిస్కెట్ దొరికినంతగా విశాఖ ప్రాంతవాసులు ఆనందపడతారంటే అతిశయోక్తికాదు. 1974 ఫిబ్రవరి 1న హైదరాబాద్-విశాఖపట్నం మధ్య ప్రారంభమైన మొట్టమొదటి రైలు ఇది. అంటే ఈ రైలు ప్రవేశపెట్టి గురువారానికి సరిగ్గా యాభై ఏళ్లు పూర్తయ్యాయి. గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు ప్రస్తుతం హైదరాబాద్(నాంపల్లి) స్టేషన్ నుంచి సాయంత్రం 5.05గంటలకు బయల్దేరి సికింద్రాబాద్, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, అనకాపల్లి మీదుగా.. విశాఖపట్నానికి చేరుకుంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉద్దండులైన ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు ఇది ఎంతో ముఖ్యమైన రైలుగా ఉండేది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు రావాలన్నా, ఇక్కడ్నుంచి స్వస్థలాలకు వెళ్లాలన్నా ఈ రైలులో వెళ్లడాన్ని సౌకర్యవంతంగా భావిస్తారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత ప్రజాప్రతినిధులు, అధికారుల తాకిడి కొంత తగ్గినా.. సాధారణ ప్రయాణికుల



నుంచి ఆదరణ ఏమాత్రం తగ్గలేదు. దక్షిణ మధ్యరైల్వే ఆధ్వర్యంలో నడుస్తున్న గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు మొత్తం 18స్టేషన్లలో ఆగుతుంది. 24 బోగీలతో అతిపొడవైన రైలుగా పేరుగాంచిన ఈ ఎక్స్‌ప్రెస్ 710 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. గురువారం సాయంత్రం గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు రైల్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధులు నాంపల్లి స్టేషన్‌లో ఘనంగా పుట్టిన రోజు వేడుకలు నిర్వహించడం విశేషం. దక్షిణ మధ్య రైల్వే కూడా ఈ ఎక్స్‌ప్రెస్‌ను సర్వాంగ సుందరంగా అలంకరించింది. ఈ రైలు ఆగే అన్ని స్టేషన్లలో వేడుకలు జరిపారు. 1990లోనే 24 కోచ్‌లతో అతి పెద్ద రైలుగా పేరొందిన గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో 2000 సంవత్సరం నుంచి ఫస్ట్‌క్లాస్ ఏసీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. 1993 నుంచే థర్డ్ ఏసీ కోచ్‌లున్న ఈ రైలు.. దక్షిణ మధ్య రైల్వేలోనే మొదటి ఏసీ కోచ్ ఉన్న ఎక్స్‌ప్రెస్‌గా పేరుగాంచింది. ఈ ఎక్స్‌ప్రెస్‌ను నేరుగా దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ పర్యవేక్షిస్తారంటే దానికి ఉన్న ప్రాముఖ్యత చెప్పనక్కర్లేదు. రైలు నిర్వహణ నుంచి సమయపాలన, పరిశుభ్రత, ఆహార నాణ్యత, ఫిర్యాదులు, ఇతర ఆపరేషన్స్ అన్నీ ప్రతిరోజూ జీఎం టేబుల్ మీద ఉండాల్సిందేనని చెబుతుంటారు.

74 టీఎంసీలు కేటాయించాలి!

గోదావరి-కావేరి అనుసంధానంపై కేంద్రాన్ని డిమాండ్ చేసిన తెలంగాణ

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గోదావరి-కావేరి అనుసంధానంలో తరలించే 148 టీఎంసీల జలాల్లో 74 టీఎంసీలను తమకు కేటాయించాలని తెలంగాణ కోరింది. నదుల అనుసంధానంలో తెలంగాణకు 45 టీఎంసీలు కేటాయించాలని ప్రతిపాదించారని, అవి సరిపోవని తెలిపింది. పూర్వ నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పలు ప్రాంతాలకు సాగునీటిని అందించాల్సి ఉన్నందున, 74 టీఎంసీలు ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. గోదావరి-కావేరి అనుసంధానంపైతెలంగాణ లేవనెత్తిన అంశాలపై చర్చించడానికి వీలుగా గురువారం జలసౌధలో జాతీయ నీటి అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) హైదరాబాద్ విభాగం చీఫ్ ఇంజనీర్ దేవేందర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. దీనికి తెలంగాణ నుంచి ఈఎన్‌సీ బి.నాగేంద్రరావు, అంతరాష్ట్ర విభాగం చీఫ్ ఇంజనీర్ మోహన్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. గోదావరి-కావేరి అనుసంధానంతో వివిధ అంశాలపై రాష్ట్ర అధికారులు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. కాగా తెలంగాణ అభ్యంతరాలపై మళ్లీ సమావేశం ఉంటుందని ఎన్‌డబ్ల్యూడీఏ స్పష్టం చేసింది. అనుమానాలన్నీ నివృత్తి చేశాకే నదుల అనుసంధానంలో ముందుకెళతామని తెలిపింది.

నేటి నుంచి పంచాయతీల్లో 'ప్రత్యేక' పాలన

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ సర్పంచుల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో శుక్రవారం నుంచి పంచాయతీలకు ప్రత్యేక అధికారులు బాధ్యత వహించనున్నారు. ఈ మేరకు గ్రామ ప్రత్యేకాధికారుల నియామకం, బాధ్యతల స్వీకరణ, విధి విధానాలను సూచిస్తూ.. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీఓ, తహశీల్దారు, ఎంపీఓ, డీటీ, ఆర్ఐ, ఇంజినీర్లు, ఎంఈవోలు, ఇతర గెజిటెడ్ స్థాయి అధికారులను గ్రామ ప్రత్యేక అధికారులుగా నియమించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా లేకపోవడంతో పదేళ్ల తర్వాత మళ్లీ గ్రామాల్లో ప్రత్యేక పాలన ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించడంతో గురువారం సర్పంచుల వద్ద ఉన్న డిజిటల్ కీలు, చెక్కులు, ఇతర రికార్డులన్నీ సీజ్ చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు.

నేడు ఈజీఎస్ ఉద్యోగులకు పే స్కేల్ ప్రకటన..?

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): 'గత ప్రభుత్వం పే స్కేల్ ప్రకటిస్తామని హామీ ఇచ్చింది.. అది అమలుకు నోచుకోలేదు.. కొత్త ప్రభుత్వం మా ఆశలు నెరవేరుస్తుందని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తమకు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి నేడు(శుక్రవారం) ఇంద్రవెల్లి సభలో తమ పే స్కేల్ ప్రకటిస్తారని, సంబురాలు జరుపుకొనేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకున్నామని ఈజీఎస్ ఉద్యోగులు ఒక ప్రకటనలో తెలిపారు.

కోర్టు ఆదేశాలిచ్చిన గంటల్లోనే జ్ఞానవాపీ సెల్లార్‌లో పూజలు


» హైకోర్టులో అప్పీలు చేసిన మసీదు కమిటీ

వారాణసి, ఫిబ్రవరి 1: జ్ఞాన్‌వాపీ మసీదు సెల్లార్‌లోని 'వ్యాస్ కీ టెఖానా'లో ఉన్న హిందూ దేవత విగ్రహాలకు పూజలు చేసుకోవచ్చంటూ జిల్లా కోర్టు ఆదేశాలు ఇచ్చిన కొద్ది గంటల్లోనే అక్కడ ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. బుధవారం రాత్రి 10.30 గంటల సమయంలో పూజలు చేసి లక్ష్మీదేవి, వినాయకులకు హారతి ఇచ్చారు. 31 సంవత్సరాల అనంతరం వ్యాస్‌జీ కా టెఖానాను పూజల కోసం తెరిచారని కాశీ విశ్వనాథ మందిర ట్రస్టు అధ్యక్షుడు నాగేంద్ర పాండే తెలిపారు. కాగా, తమకు అప్పీలు వంటి న్యాయ ప్రక్రియకు కూడా అవకాశం ఇవ్వకుండా హిందువులు పూజలు చేసుకోవడానికి అనుమతి ఇవ్వడం తగదని పేర్కొంటూ మసీదు కమిటీ గురువారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే తొలుత హైకోర్టులో పిటిషన్ వేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ చెప్పడంతో దాన్ని అమలు చేసింది. అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ సమర్పించి అత్యవసరంగా విచారణ జరపాలని కోరింది.

హేమంత్ సోరెన్‌కు ఒక రోజు కస్టడీ

» 10 రోజుల పాటు ఇవ్వాలన్న ఈడీ వినతిపై నేడు తీర్పు
» రాంచీలో 8.5 ఎకరాలు ఆక్రమించినట్టు కేసు నమోదు

రాంచీ, ఫిబ్రవరి 1: మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను గురువారం ఇక్కడి పీఎంఎల్ఏ ప్రత్యేక కోర్టు ఒక రోజు జ్యుడీషియల్ కస్టడీకి పంపించింది. పోలీసులు ఆయనను ఇక్కడి బీర్సా ముండా సెంట్రల్ జైలుకు తరలించారు. ఆయనను పది రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలన్న వినతిపై కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించనుంది. ఈడీ బుధవారం ఆయనను ఏడు గంటల పాటు విచారించింది. అనంతరం ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయగా రాత్రి పది గంటల సమయంలో గవర్నర్ హౌస్ వద్ద అరెస్టు చేసింది. కాగా, రాత్రి సమయంలో గవర్నర్ హౌస్ ఆవరణలోనే అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ గురువారం సోరేన్ లాయర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ సమయంలో ఆయన ధరించిన మతపరమైన లాకెట్, రింగ్‌లను తీసివేయాలని ఈడీ అధికారులు కోరగా అందుకు ఆయన నిరాకరించారు. రాంచీలో సోరేన్ 12 చోట్ల 8.5 ఎకరాల విస్తీర్ణంగల స్థలాలను అక్రమంగా కలిగి ఉన్నారంటూ ఈడీ కేసుపెట్టింది. ఈ వ్యవహారంలో నగదు అక్రమ నగదు చలామణి జరిగినట్టు ఆరోపించింది. తొలుత భూమి రికార్డుల నకిలీ పత్రాలను తయారు చేస్తున్నారంటూ రెవెన్యూ శాఖ సబ్ ఇన్‌స్పెక్టర్ భాను ప్రతాప్ ప్రసాద్‌పై కేసు నమోదయింది. ఆయన వద్ద 11 ట్రంకు పెట్టెల్లో ఒరిజినల్, నకిలీ దస్తావేజులు, 17 ఒరిజినల్ రిజిస్టర్లు లభించాయి. దీనిపై జరిగిన విచారణలో ఇందులో సోరేన్‌కు సంబంధం ఉందంటూ ప్రసాద్ ఫోన్‌లో లభించిన సమాచారం ఆధారంగా ఈడీ కేసు నమోదు చేసింది. వాంగ్మూలం నమోదు చేయడానికని పిలిచి ఎలా అరెస్టు చేస్తారని సోరేన్ తరఫున హాజరైన అడ్వకేట్ జనరల్ రాజీవ్ రంజన్ ప్రశ్నించారు. ఇది ప్రభుత్వాన్ని కూలగొట్టడానికి జరిగిన కుట్ర అని ఆరోపించారు.



జేఎంఎం కూటమి ఎమ్మెల్యేలను తరలించడానికి బేగంపేట విమానాశ్రయం వద్ద సిద్ధంగా ఉన్న బస్సులు

ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

చంపయి సోరెన్ గవర్నర్ రాధాకృష్ణన్‌ను కలిశారు. హేమంత్ సోరెన్ రాజీనామా చేసిన అనంతరం రాష్ట్రానికి కొత్త సీఎం లేకపోవడంతో గందరగోళ పరిస్థితులు నెలకొని ఉన్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి లేకపోవడంతో రాజకీయ సంక్షోభం ముదిరిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్న తమ విజ్ఞప్తిని అంగీకరించాలని కోరారు. కాగా, చంపయి సోరెన్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించడంలో గవర్నర్ ఆలస్యం చేయడంతో.. జేఎంఎం-కాంగ్రెస్ కూటమి ఎమ్మెల్యేలను హైదరాబాద్ తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. గురువారం రెండు చార్టర్డ్ విమానాలను సిద్ధం చేయగా.. సాయంత్రం 6.30 గంటల సమయంలో పొగమంచు ఎక్కువగా ఉండడంతో వాటిని రద్దు చేశారు. 81 మంది సభ్యులున్న ఝార్ఖండ్ అసెంబ్లీలో జేఎంఎం కూటమికి 43 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇక మనీలాండరింగ్ కేసులో ఈడీ తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ మాజీ సీఎం హేమంత్ సోరెన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆయన పిటిషన్‌ను విచారించేందుకు సీజేఐ ముగ్గురు న్యాయమూర్తులతో ప్రత్యేక ధర్మాసనాన్ని ఏర్పాటు చేశారు. సోరెన్ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరపనున్నారు.

తీరనున్న వనపర్తి ప్రజల చిరకాల కోరిక

» ఏఐసీసీ కార్యదర్శి, మాజీ మంత్రి చిన్నారెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి చిన్నారెడ్డి

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 1 : వనపర్తి ప్రజల చిరకాల కోరిక అయినటువంటి రైల్వేలైన్ కల త్వరలోనే తీరనుందని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ మంత్రి డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వనపర్తి ప్రాంత ప్రజలు గత 25 సంవత్సరాలుగా రాయచూర్-మాచర్ల రైల్వేలైన్ కోసం ఆశగా ఎదురుచూస్తున్నారని అన్నారు. అలాంటి రైల్వేలైన్ రాయచూర్ నుంచి గద్వాల వరకు పూర్తి చేసుకుని రైలు పట్టాలు ఎక్కిందన్నారు. గద్వాల నుంచి మాచర్ల లైన్ మాత్రం ఇంకా పూర్తి కాలేదన్నారు. కానీ ఈ మధ్యనే మరో కొత్త రైల్వేలైన్ గద్వాల నుంచి డోర్నకల్ వరకు ఫైనల్ లోకేషన్ సర్వే పూర్తయిందని సంతోషం వ్యక్తం చేశారు. వనపర్తి ప్రజలు కోరుకుంటున్న గద్వాల-మాచర్ల లైన్ కోసం కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సుముఖంగా ఉన్నారని, ఈ లైన్ కూడా పూర్తి చేయాలనే ఉద్దేశంతో త్వరలోనే కేంద్ర రైల్వేశాఖ మంత్రిని స్వయంగా రేవంత్‌రెడ్డి కలిసి వినతిపత్రం ఇవ్వనున్నారని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, పీసీసీ డెలిగేట్ శంకర్‌ప్రసాద్, మహిళా నాయకురాలు ధనలక్ష్మి, అక్తర్, ఖమ్మర్‌మియా, కిరణ్‌కుమార్, సత్యారెడ్డి, అనిస్, యాదయ్య, బీ.కృష్ణ, కదిరె రాములు, పరశురాం, రాగివేణు, చీర్ల జనార్దన్, బాబా, అబ్దుల్లా, సేవాదళ్ జానకి రాములు, ద్యారపోగు విజయ్‌బాబు తదితరులున్నారు. అంతకుముందు ఆయన గోపాల్‌పేట మండలంలోని బుద్దారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త తోల శ్రీహరి మృతి చెందడంతో పార్టీ సభ్యత్వం ద్వారా మంజూరైన రూ.రెండు లక్షల బీమా చెక్కును మృతుడి తండ్రి వెంకటయ్యకు అందించారు.

కేజీబీవీ తనిఖీ

చిన్నంబావి, ఫిబ్రవరి 1 : మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలను జీసీడీవో సుబ్బలక్ష్మి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె వంటగదిని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం ఆమె ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. రానున్న పబ్లిక్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని సిలబస్, ప్రత్యేక శిక్షణ తరగతుల నిర్వహణ, ప్రశ్న, జవాబుపత్రాల నమూనాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ రమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి : ఎస్పీ

వనపర్తి క్రైమ్, ఫిబ్రవరి 1 : బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఎస్పీ రక్షిత కె.మూర్తి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఆపరేషన్ స్మైల్-10 కార్యక్రమం జనవరి ఒకటి నుంచి 31వరకు నిర్వహించామని తెలిపారు. నెలరోజుల్లో వనపర్తి జిల్లాలో బాలకార్మికులను పనిలో పెట్టుకొన్న వారిపై 13 ఎఫ్ఐఆర్ కేసులు నమోదు చేశామన్నారు. 101 మంది బాలకార్మికులకు విముక్తి కల్పించామని, అందులో 83 మంది బాలురు, 18 మంది బాలికలతో మొత్తం 101 మందిని సీడబ్ల్యూసీ చైల్డ్ వెల్ఫేర్ సెంటర్‌కు అప్పజెప్పి బాల కార్మికుల యజమానులు, తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించామని వివరించారు.

బాలలు ఆశయాలను నెరవేర్చుకోవాలి

» బాలల సంరక్షణ అధికారి సురేందర్


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న బాలల సంరక్షణ అధికారి సురేందర్

వనపర్తి రూరల్ , ఫిబ్రవరి 1 : బాలలు ఆశయాలను నెరవేర్చుకోవాలని బాలల సంరక్షణ అధికారి సురేందర్ అన్నారు. గురువారం వనపర్తి పట్టణంలోని లిటిల్ బర్డ్స్ హైస్కూల్‌లో జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలల రక్షణ చట్టాలు - హక్కులపైన అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన బాల్య వివాహ నిషేధ చట్టం-2006, గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం-1994 , జిల్లా బాలల పరిరక్షణ విభాగం అందిస్తున్న సేవలు, చైల్డ్ హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నంబర్స్ 1098, 100 అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీసీపీయూ సోషల్ వర్కర్ నరేందర్, సీహెచ్ఎల్ కేస్ వర్కర్ రవిరాజు, పాఠశాల హెచ్ఎం గులాంహుస్సేన్, ఉపాధ్యాయుడు బాలరాజు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిరోధానికి సహకరించాలి

పాన్‌గల్, ఫిబ్రవరి 1 : మండలంలో బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతీ ఒక్కరు సహకరించాలని మహిళా శిశు సం క్షేమ జిల్లా శాఖ మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్టులు శ్రీవాణి, సలోమీలు అన్నా రు. గురువారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో వీవోఏలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మహిళలు సామాజికంగా ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారాలు, పనిచేసే ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు గురయ్యే విషయాల గురించి, కుటుంబ కలహాలు, సమస్యలు, వాటి పరిష్కారాల గురించి మహిళ హెల్ప్‌లైన్ నెంబర్ 181 గురించి వివరించారు. అనంతరం బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. సమావేశంలో గ్రామీణ అభివృద్ధి శాఖ డీపీఎం ప్రభాకర్, ఏపీఎం సద్గురునాయక్, సీసీలు ధనలక్ష్మి, నాగరాజు, స్వామి, వీవోఏలు పాల్గొన్నారు.

కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వమే

» బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ

వనపర్తి అర్బన్, ఫిబ్రవరి 1 : కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వమే అధికారంలోకి రానుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నారాయణ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గామ్ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా పట్టణ అధ్యక్షుడు బచ్చురాం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతీ గడపకు చేరాయన్నారు. కాంగ్రెస్ పార్టీ మునిగిపోయే నావ లాంటిదని, ఆ పార్టీని విపక్ష పార్టీలు కూడా నమ్మే పరిస్థితిలో లేక ఇటీవలే ఇండియా కూటమి నుంచి ఒక్కొక్కరు బయటికి వస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం, జిల్లా ప్రధాన కార్యదర్శి రామన్‌గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్, పార్లమెంట్ కోకన్వీనర్ ప్రవీణ్, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్ తదితరులున్నారు.

పదవ తరగతి విద్యార్థులకు అల్పాహారం

పాన్‌గల్, ఫిబ్రవరి 1 : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులకు పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు రాంబాబు, కృష్ణారెడ్డిలు అల్పాహారం ఏర్పాటు చేశారు. అల్పాహారం ఏర్పాటు చేసిన దాతలను పాఠశాల ఉపాధ్యాయ బృందం పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు హైమావతి, ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, హెచ్ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు అజ్మీర్ దర్గాకు తీసుకెళ్లే చాదర్ ఊరేగింపు

అమరచింత, ఫిబ్రవరి 1 : ఇమాన్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం రాజస్థాన్‌లోని అజ్మీర్‌దర్గాకు తీసుకెళ్లే చాదర్‌ను ఊరేగింపు చేయనున్నట్లు జామియా మసీదు కమిటీ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, ఇమాన్ ట్రస్టు సభ్యులు అన్వార్, ఖాజాహుస్సేన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ ఏడాది మాదిరిగా ఈసారి కూడా అమరచింత నుంచి ఇమాన్ ట్రస్టు ఆధ్వర్యంలో అజ్మీర్‌కు తీసుకెళ్లే దర్గా చాదర్ ఊరేగింపు కార్యక్రమానికి మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరవుతున్నారని వారు తెలిపారు. శుక్రవారం నమాజ్ అనంతరం జరిగే ఈ ఊరేగింపులో ముస్లింలు, ట్రస్టు సభ్యులు పాల్గొనాలని వారు కోరారు.

నేడు పల్లెల్లోకి ప్రత్యేకాధికారులు

» గ్రామ పంచాయతీల్లో నేడు బాధ్యతలు చేపట్టనున్న ఆఫీసర్లు



అల్వాల గ్రామ పంచాయతీ కార్యాలయం

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఫిబ్రవరి 1 : సర్పంచ్, వార్డు మెంబర్ల పదవీకాలం గురువారంతో పూర్తి కావడంతో నేటి నుంచి గ్రామ పంచాయతీల పరిపాలన ప్రత్యేక అధికారుల చేతుల్లోకి వెళ్లనుంది. స్పెషల్ ఆఫీసర్లు తమకు కేటాయించిన గ్రామాల్లో బాధ్యతలు తీసుకుని పాలనా వ్యవహారాలను చూడనున్నారు. కొత్త సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికలు పార్లమెంట్ ఎన్నికల తరువాతే జరిగే అవకాశం ఉండడంతో అంతవరకు స్పెషల్ ఆఫీసర్ల పాలన కొనసాగనుంది.

పంచాయతీకో ప్రత్యేక అధికారి

రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగి కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలోకి వచ్చింది. ఇంతలోనే గ్రామాల్లో సైతం పాలకుల పదవీకాలం ముగిసింది. ప్రస్తుతం కొత్త పాలకవర్గానికి ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేదు. కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో పాలన కుంటుపడకుండా ప్రభుత్వం స్పెషల్ ఆఫీసర్లతో పకడ్బందీగా పరిపాలన వ్యవహారాలను కొనసాగించాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం జిల్లాలోని 255 గ్రామ పంచాయతీలలో పాలన బాధ్యతలను చూసేందుకు పంచాయతీకో ప్రత్యేక అధికారిని నియమించింది. ఇందుకోసం ఆయా మండల స్థాయిలో ఉండే తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, వ్యవసాయాధికారులు, పశువైద్యాధికారులు, ఎంపీవోలు, గిర్దావర్లు, సీనియర్ అసిస్టెంట్లు, వివిధ విభాగాలు ఏఈలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, జూనియర్ అసిస్టెంట్లు, హాస్టల్ వార్డెన్లు, ఏఈవోలు, ఐసీడీఎస్ ఉద్యోగులు, ఆర్అండ్‌బీ శాఖ తదితర డిపార్ట్‌మెంట్ల అధికారులను నియమించింది. వీరంతా నేడు తమకు కేటాయించిన గ్రామాల్లో పాలన బాధ్యతలను చేపట్టనున్నారు. అంతేకాకుండా జాయింట్ చెక్ పవర్ బాధ్యతలను ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులకు, స్పెషల్ ఆఫీసర్లకు ప్రభుత్వం అప్పజెప్పింది. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, అభివృద్ధి, పింఛన్లు, పచ్చదనం, విద్యుత్, సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణ, ప్రకృతివనాల రక్షణ, రహదారులు, సంక్షేమ పథకాల అమలుతీరు వంటి అంశాలపై ఇదివరకే ఉన్నతాధికారులు అవగాహన కల్పించారు. ఈనెల మూడవ తేదీన ప్రత్యేక అధికారులకు సంబంధిత శాఖ మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశా నిర్దేశం చేయనున్నట్లు సమాచారం.

సీసీ రోడ్ల నిర్మాణం నాణ్యతగా ఉండాలి

» ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట, ఫిబ్రవరి 1 : మండలంలోని నిర్వేన్, చర్లపల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణాలు నాణ్యతగా ఉండేలా చర్యలు తీసుకోవాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం నిర్వేన్ గ్రామంలో రూ.13 లక్షలు, చర్లపల్లిలో రూ.15 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్లకు ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీసీ రోడ్లకు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నుంచి నిధులు మంజూరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు విశ్వనాథం, శేఖర్‌రెడ్డితో పాటు, జడ్పీటీసీ మాజీ సభ్యులు జితేంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ పీజే.బాబు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీసుపల్లియాదవ్, నాయకులు గొల్లబాబు, బోయెజ్, కర్ణాకర్‌రెడ్డి, మాసన్న, నరేందర్‌రెడ్డి, సాయిలుయాదవ్, వెంకటరమణ, రాంలాల్‌నాయక్, మోహన్‌రెడ్డి, జేసీబీ రాము, ముజీబ్, బాలరాజు తదితరులున్నారు.

గ్రామాలాభివృద్ధికి కృషి

మదనాపురం : గ్రామాలాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని దంతనూరు గ్రామంలో జాతీయ ఉపాధి హామీ నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ జన్ను పద్మావతి, వైస్ ఎంపీపీ యాదమ్మ, సర్పంచు శ్రావణి, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, కృష్ణవర్దన్ రెడ్డి, జగదీష్, నాగరాజు, రాజవర్దన్‌రెడ్డి, మహేష్ కుమార్, రామకృష్ణ, శేఖర్‌రెడ్డి, కోటేష్ పాల్గొన్నారు.


దంతనూరులో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

కర్పూరి ఠాకూర్‌కు భారతరత్న రావడంపై హర్షం

» ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం


మోదీ, ఠాకూర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసిన బీజేపీ నాయకులు, నాయీ బ్రాహ్మణులు

వనపర్తి అర్బన్, ఫిబ్రవరి 1 : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి లోక జన నాయకుడు కర్పూరి ఠాకూర్‌కు భారతరత్న అవార్డు ప్రకటించడంపై నాయీ బ్రాహ్మణులు, బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌చౌరస్తాలో ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ధన్యవాదాలు తెలుపుతూ ఆయన చిత్రపటానికి నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా, పట్టణ కమిటీ తరఫున క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. దేశంలో అణగారిన కులాలకు చెందినటువంటి వారికి, దేశ సేవ చేసినటువంటి వారిని గుర్తించి పద్మశ్రీ, పద్మ విభూషణ్, భారతరత్న అవార్డు ఇవ్వడం నరేంద్రమోదీ ప్రభుత్వం చేస్తున్న కృషిని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం, వనపర్తి అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సీతారాములు, బీజేపీ ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షులు అశ్విని శ్రీనివాసులు, నాయకులు నందకుమార్, నాయీ బ్రాహ్మణ జిల్లా అధ్యక్షుడు రమేష్, పట్టణ అధ్యక్షుడు మోహన్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణగౌడ్, జిల్లా కార్యదర్శి ఆశన్న, బీజేపీ జిల్లా నాయకుడు గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

స్వీపర్‌గా మారిన ఇన్‌చార్జి హెచ్‌ఎం

» అవాక్కవుతున్న ప్రజలు


పాఠశాల ఆవరణను శుభ్రం చేస్తున్న ఇన్‌చార్జి హెచ్‌ఎం ప్రమీల

అమరచింత, ఫిబ్రవరి 1 : ఆ పాఠశాల విద్యార్థులకు విద్యాబుద్ధులు చెబుతూ ఇన్‌చార్జి హెచ్‌ఎంగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తూ స్వీపర్‌గా మారారు ఓ ఉపాధ్యాయురాలు. వనపర్తి జిల్లా అమరచింత ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాలలో గత మూడేళ్లుగా ప్రమీల అనే ఉపాధ్యాయులు ఇన్‌చార్జి హెచ్‌ఎంగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. పాఠశాలలో రెగ్యులర్ స్వీపర్ కానీ, అటెండర్ కానీ లేకపోవడంతో ప్రైవేటు వ్యక్తులచే పాఠశాలను శుభ్రం చేయించేవారు. చాలీచాలని డబ్బులు ఇవ్వడం కారణంగా ప్రైవేటు వ్యక్తులు సైతం బంద్ కావడంతో గత ఆరు నెలలుగా ప్రమీల టీచర్ స్వయానా ఉదయమే పాఠశాలకు చేరుకొని విద్యార్థులు రాకముందే తరగతి గదులను ఊడ్చుకోవడంతో పాటు, పాఠశాల ఆవరణలో సైతం శుభ్రం చేసుకుంటు వస్తోంది. ప్రధాన రహదారిపై ఈ పాఠశాలలో ఉండడంతో ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇన్‌చార్జి హెచ్‌ఎంగా ఉన్న ప్రమీల స్వీపర్ అవతారం ఎత్తడం చూసి ప్రజలు అవాక్కవుతున్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న స్వీపర్ పోస్టులను భర్తీ చేయాలని పలువురు కోరుతున్నారు.

ఈ విషయమై ఎంఈవో భాస్కర్ సింగ్‌ను వివరణ కోరగా స్వీపర్ల కొరత ఉన్న విషయం వాస్తవమేనని, ప్రమీల టీచర్‌కు గతంలో కూడా పాఠశాల శుభ్రం చేయవద్దని ప్రైవేటు వ్యక్తులను పెట్టుకోవాలని సూచించినట్లు ఆయన తెలిపారు.

ఫలించిన యువకుడి పోరాటం

» హర్షం వ్యక్తం చేస్తున్న పెన్షన్ లబ్ధిదారులు, గ్రామస్థులు


గురువారం కాశింనగర్ గ్రామంలో పెన్షన్ డబ్బులు ఇస్తున్న నిర్వాహకులు

వనపర్తి రూరల్, ఫిబ్రవరి 1 : వనపర్తి మండల పరిధిలోని కాశింనగర్ గ్రామానికి చెందిన రేవల్లి రాములు అనే యువకుడు గ్రామంలోని పెన్షన్‌దారుల సమస్యను పరిష్కరించాడు. ఈ గ్రామంలోని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పెన్షన్ తీసుకోవడానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరుమలాపురం గ్రామానికి వెళ్లేవారు. పెన్షన్‌దారుల సమస్యను ఎవరు పట్టించుకోకపోవడంతో రాములు ఇటీవల రాష్ట్రపతి ద్రౌపదిముర్మతో పాటు, పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఉన్నతాధికారుల దృష్టికి మెయిల్, పోస్టల్ ద్వారా ఫిర్యాదు చేశారు. అలాగే ఇటీవలే లబ్ధిదారులు, గ్రామస్థులతో కలిసి రాములు కలెక్టరేట్‌లో ప్రజావాణిలో భాగంగా కలెక్టర్ తేజస్ నందలాల్‌కు కూడా ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించి చర్యలు చేపట్టిన అధికారులు ఫిబ్రవరి నెలకు సంబంధించిన పెన్షన్ డబ్బులను గ్రామంలోనే ఇవ్వాలని ఆదేశాలు జారీ చేయడంతో గురువారం గ్రామంలోనే పెన్షన్ డబ్బులు లబ్ధిదారులకు ఇచ్చారు. గత కొన్నేళ్లుగా ప్రజాప్రతినిధుల వల్ల కానీ సమస్యను రాములు అనే యువకుడు పరిష్కరించడంతో గ్రామస్థులు అతనికి కృతజ్ఞతలు తెలిపారు.

కేసీఆర్‌కు శుభాకాంక్షలు


కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నిరంజన్‌రెడ్డి

వనపర్తి అర్బన్, ఫిబ్రవరి 1 : అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు శాసనసభ కార్యాలయంలో గురువారం మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన తన కార్యాలయంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల సమావేశంలో పాల్గొని దిశా నిర్దేశం చేసినట్లు నిరంజన్‌రెడ్డి తెలిపారు.

వార్డుల్లో అంధకారం లేకుండా చేస్తాం

అమరచింత, ఫిబ్రవరి 1 : మునిసిపాలిటీ పరిధిలోని పది వార్డుల్లో ఎక్కడా అంధకారం లేకుండా చర్యలు తీసుకుంటామని అమరచింత మునిసిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ తెలిపారు. పట్టణంలోని టీసీ కాలనీలోని పలు ప్రాంతాల్లో నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు, నూతన వైర్లు, వీధిదీపాల ఏర్పాట్ల పనులను గురువారం ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పట్టణంలో అవసరం ఉన్న మేరకు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, వీధిదీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ

కొత్తకోట, ఫిబ్రవరి 1 : మండలంలోని అమడబాకుల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆ గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ కృష్ణయ్య క్రీడా సామగ్రిని గురువారం అందజేశారు. పీఈటీ రాంమోహన్, హెచ్ఎం జమీల్‌మునవర్, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, భాస్కర్, శ్రీనివాస్‌రెడ్డి, ధనుంజయగౌడ్, రమేష్‌బాబు, రాధిక, భారతమ్మ, రామకృష్ణ, రాజారెడ్డి విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందించారు.

నేడు న్యాయయాత్ర సభ

ఆత్మకూరు, ఫిబ్రవరి 1 : ఆత్మకూరులో నిర్వహిస్తున్న న్యాయయాత్ర సభకు మండలంలోని ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పరమేష్, నాయకులు రహమతుల్లా ఓ ప్రకటనలో కోరారు.

ఉమ్రా యాత్రికులకు సన్మానం

కొత్తకోట, ఫిబ్రవరి 1 : పట్టణానికి చెందిన తహరాభాను, నిజామోద్దీన్ ఖురేషి దంపతులతో పాటు బషీరాభాను ఆమె కుమారుడు సద్దాం ఉమ్రా యాత్రకు వెళ్తున్న సందర్భాన్ని పురస్కరించుకొని బీజేపీ నాయకులు సన్మానం చేశారు. యాత్రను విజయవంతం చేసుకొని తిరిగి రావాలని ఆకాంక్షించారు. సన్మానం చేసిన వారిలో కిసాన్‌మోర్చా రాష్ట్ర నాయకుడు వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ భరత్‌భూషణ్, ఓబీసీ మోర్చా జిల్లా నాయకులు బాలు, గట్టుయాదవ్, హాజీభాయ్, ఖురేషి తదితరులున్నారు.

నేడు ఆత్మకూర్‌లో బీఆర్ఎస్ సమావేశం

ఆత్మకూరు, ఫిబ్రవరి 1 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మక్తల్ నియోజకవర్గంలోని వెంకటేశ్వర కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి నేతృత్వంలో బీఆర్ఎస్ సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆయన కోరారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం


చిన్న నాగయ్య(ఫైల్)

రేవల్లి, ఫిబ్రవరి 1 : రేవల్లి మండలం చీర్కపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల గాంధీనగర్‌కు చెందిన గొల్ల చిన్న నాగయ్య(56) అనే వ్యక్తి మృతదేహం గురువారం గాంధీనగర్ గ్రామానికి సమీపంలో గల పెద్దగుట్టపై దొరికినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. గాంధీనగర్ గ్రామానికి చెందిన చిన్న నాగయ్య అనే వ్యక్తి అదృశ్యమైనట్లు వారి కుమారుడు నాగమల్లయ్య జనవరి మూడో తేదీన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గురువారం ఉదయం గ్రామ సమీపంలో గల పెద్దగుట్టపై ఒక చెట్టుకు పంచె, చెట్టు కింద వ్యక్తి మృతదేహాన్ని చూసిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందజేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా నాగమల్లయ్యకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న మల్లయ్య కుటుంబ సభ్యులు పంచె, గొంగడి చూసి తన తండ్రి చిన్న నాగయ్యదే అని నిర్ధారించారు. వ్యక్తి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పంపామని ఎస్సై తెలిపారు.

చిరుత దాడిలో మేక మృతి

ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 1 : మండల కేంద్రం శివారు ప్రాంతం ఎర్రగుంట్ల గుట్ట వద్ద గురువారం మధ్యాహ్నం చిరుత దాడిలో మేక మృతి చెందింది. మేకల కాపరి గోనెల రాజు గురువారం మధ్యాహ్నం తండా శివారులో మేకలను మేపుతుండగా పొదలమాటున ఉన్న చిరుత ఒక్కసారిగా మేకపై దాడి చేసి ఈడ్చుకెళ్లిందని అన్నారు. ఇరుగు పొరుగు వారికి సమాచారం చేరవేయగా మేకను వదిలేసి చిరుత గుట్ట వైపు వెళ్లిందని తెలిపారు.

ప్రజలు ఆశీర్వదిస్తే ప్రజాప్రతినిధులుగా కొనసాగుతారు

» ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

» సర్పంచులకు ఘన సన్మానం


ఆత్మకూరులో సర్పంచులను సన్మానిస్తున్న వైస్ ఎంపీపీ, ఆయా గ్రామాల పెద్దలు


పెద్దమందడి మండలంలో సర్పంచులను సన్మానించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

పెద్దమందడి, ఫిబ్రవరి 1 : ప్రజలు ఆశీర్వదిస్తే ప్రజాప్రతినిధులుగా కొనసాగుతారని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో ఏర్పాటుచేసిన సర్పంచుల ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని, సర్పంచులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రఘుప్రసాద్, ఎంపీడీవో అఫ్జల్, వివిధ గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

● ఖిల్లాఘణపురం : మండల కేంద్రంలోని పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని 27 మంది సర్పంచులకు ఎంపీపీ కృష్ణనాయక్ ఆధ్వర్యంలో శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కృష్ణనాయక్ మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి చేయడంలో సర్పంచుల కృషి ప్రశంసనీయమని అన్నారు. జడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్, పీఏసీఎస్ చైర్మన్ మురళీధర్‌రెడ్డి, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీవో రాజు, ఏవో మల్లయ్య, పంచాయతీరాజ్ ఏఈ కబీర్‌దాస్, మండలంలోని సర్పంచులు పాల్గొన్నారు.

● ఆత్మకూరు : మండల పరిధిలోని బాలకృష్ణపూర్, ఆరేపల్లి, రేచింతల గ్రామాల సర్పంచులు అనసూయమ్మ, తుకారాంనాయక్, భాస్కర్‌లతో పాటు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులను ఆత్మకూరు వైస్ ఎంపీపీ కోటేశ్వర్, మండల మహిళా కాంగ్రెస్ నాయకురాలు అనంతమ్మలు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ కోటేశ్వర్ మాట్లాడారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు లక్ష్మీకాంత్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, రాములుతో పాటు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

● రేవల్లి : మండలంలోని చెన్నారం గ్రామ సర్పంచ్ రమేష్‌తో పాటు, వార్డు సభ్యులను గ్రామస్థులు గురువారం ఘనంగా సన్మానించారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో రమేష్, కార్యదర్శి బాలరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ పద్మ, అంగన్‌వాడీ టీచర్లు రేణుక, రమాదేవి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రాజిరెడ్డి, నాయకులు కురుమయ్య, రవీందర్‌రెడ్డి, సత్తార్, లింగం, మద్దిలేటి, మల్లయ్య, ఎల్లస్వామి, రాజు, శ్రీనివాస్, స్వామి, బుచ్చిబాబు, సుధాకర్, నాగిరెడ్డి, బీరయ్య, సుల్తాన్, షరీఫ్, నాగేష్, రమేష్, కురుమయ్య, సూరయ్య తదితరులు పాల్గొన్నారు.



రేవల్లి మండలం చెన్నారంలో సన్మానం పొందిన సర్పంచ్‌లు



ఖిల్లాఘణపురంలో సర్పంచులను సన్మానించిన ఎంపీపీ కృష్ణనాయక్